క్లుప్తంగా

ఐటీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కిరణ్‌కుమార్

కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ విభాగం సంయుక్త కార్యదర్శిగా విజ్జిన విజయ కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం సాయంత్రం ఈ నియామకాన్ని ప్రకటించింది.

నేడు పైడా వర్ధంతి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని విడోస్ హోమ్ వ్యవస్థాపకులు పైడా రామకృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ఈ నెల 18న పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విడోస్ హోమ్ చైర్మన్ పైడా రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం సాంబమూర్తినగర్‌లోని మహర్షి బులుసు సాంబమూర్తి దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తామన్నారు. అన్నదానం కూడా నిర్వహిస్తున్నామన్నారు.

లింగ్విస్టిక్స్ అండ్ కల్చర్‌లో ఖాళీలు

యానాం: పుదుచ్చేరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ లింగ్విస్టిక్స్ అండ్ కల్చర్ శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు డైరెక్టర్ వి.కలైపెరుమాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 24వ తేదీలోగా లింగ్విస్టిక్స్–3, తమిళ లిటరేచర్–3, ఆంత్రోపాలజీ–2, ఫోక్‌లోర్–1లకు పీఐఎల్‌సీ.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సీసీ రోడ్లకు భూమి పూజ

తాళ్లరేవు: తాళ్లరేవు గ్రామపంచాయతీ పరిధిలోని కేశవస్వామి కాలనీలో రూ.9 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ శుక్రవారం భూమి పూజ చేశారు. స్థానిక కాలనీలోని కాజా శ్రీనివాసరావు గృహం నుంచి బూలా గిరిబాబు ఇంటి వరకూ, గుత్తుల ఈశ్వరరావు ఇంటి నుంచి మేడిశెట్టి గొల్లయ్య ఇంటి వరకూ రహదారులు నిర్మించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి సుహాసినిదేవి, మాజీ సర్పంచ్ రెడ్డి బాబు, వార్డు మెంబర్ టేకుమూడి రాంబాబు, సచివాలయ కార్యదర్శి వేణుగోపాలస్వామి, ఇంజినీర్ శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్ల అందజేత



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత

తాళ్లరేవు: నిరుపేద మహిళలకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 36 మంది లబ్ధిదారులకు ఎంపీపీ రాయుడు సునీత అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాయుడు గంగాధర్, చిట్టూరి చలపతి, కుడుపూడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేట హేచరీలో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. హేచరీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఒండంగి మండలం ఏవీ నగరానికి చెందిన పోలవరపు రాజు (29) కుటుంబ కలహాల కారణంగా గురువారం రాత్రి తాను పని చేస్తున్న హేచరీలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మీ హక్కులు తెలుసుకోండి...

- మానవ హక్కులపై జీజీహెచ్‌లో అవగాహన సదస్సు
- సిబ్బంది, రోగులు, సామాన్యులకు సూచనలు



మెమెంటో అందుకుంటున్న డాక్టర్ పుష్కరరావు



సదస్సుకు హాజరైన సిబ్బంది, రోగులు, వారి సహాయకులు

కాకినాడ క్రైం: అవినీతి, అణచివేత, వేధింపులు, చీత్కారాలు, లంచాలు, లైంగిక వేధింపులు ఇలా ఏవైనా భరిస్తూ బతికేయాల్సిన దుస్థితి నేడు లేదు. ప్రతి ప్రశ్నకు ఓ సమాధానాన్ని, ప్రతి సమస్యకు ఓ పరిష్కారాన్ని రాజ్యాంగం కల్పించింది. అయితే, వాటిపై సామాన్య ప్రజలతో పాటు విద్యావంతుల్లో కూడా అవగాహన లేకపోవడం శాపంగా పరిణమిస్తోంది. నిక్షేపంగా వినియోగించుకోవలసిన హక్కులను కాలరాస్తున్నా నీళ్లు దిగమింగుతూ బతికేయాల్సి రావడం ఆవేదన కలిగిస్తోంది. అటువంటి విపత్కర పరిస్థితుల నుంచి మనల్ని మనం రక్షించుకుని ఇతర బాధితులకు అండగా నిలవాల్సిన ఆవశ్యకతపై శుక్రవారం జీజీహెచ్‌లో అవగాహన సదస్సు జరిగింది. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కర్రి అచ్యుతరామారెడ్డి, జనరల్ సెక్రటరీ జీఎస్ నాయుడు, జిల్లా కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది తప్పెట్ల పృథ్వీరాజ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగగా, ముఖ్య అతిథిగా సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాసు హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా డిప్యూటీ కలెక్టర్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావు, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, నర్సింగ్ సూపరింటెండెంట్ సంధ్య హాజరయ్యారు.

ఆసుపత్రిలోనే ఎందుకంటే..

ఈ సదస్సును జీజీహెచ్‌లోనే ఏర్పాటు చేసేందుకు ముఖ్య కారణం ఇక్కడ సిబ్బంది, అలాగే రోగులు వారి హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇరు వర్గాల మధ్య నాణ్యమైన సేవలు కొనసాగడానికేనని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు అన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే జీజీహెచ్ వంటి దుర్భేధ్య వైద్య వ్యవస్థలో రోగులు, వారికి సేవలు అందిస్తున్న నర్సులు, ఇతర సిబ్బంది, వైద్యుల మధ్య సమన్వయం బాగుంటుందని తద్వారా అత్యంత నాణ్యమైన సేవల బదలాయింపు జరుగుతుందని సంస్థ జిల్లా కార్యదర్శి, ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి ఎంవీవీ మహాలక్ష్మి అన్నారు.

ఇడ్లీతో సాంబారు ఇవ్వనందుకు జరిమానా

బోర్డులో ఇడ్లీ, సాంబారు, చట్నీ అని పెట్టి, పార్శిల్‌లో సాంబార్ ఇవ్వలేదని ఓ వినియోగదారుడు తాజాగా వినియోగదారు కోర్టును ఆశ్రయించాడనీ కోర్టు అది నేరంగా పరిగణించి హోటల్ యజమానికి రూ.6 వేలు జరిమానా విధించిందని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాసు అన్నారు. ఈ సంఘటన తాజాగా గుంటూరులో జరిగిందని వెల్లడించారు. ఇంతటి శక్తి వంతమైన చట్టాలను సద్వినియోగం చేసుకుంటూ హక్కులు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పాల నాణ్యతను గుర్తించేందుకు చిట్కా చెప్పారు. పాలను ఓ పలకపై ఏటవాలు దిశలో పోస్తే ఒకే సారి జారిపోతే కల్తీవని, మెల్లిగా జారితే స్వచ్ఛమైనవనీ, ముద్దలుగా అంటుకుంటే ఇంకేదో పదార్థం పాలల్లో కలపబడినట్లని అన్నారు. తేనె నాణ్యత నీటిలో కరగడాన్ని బట్టి తెలుస్తుందని పేర్కొన్నారు. అటువంటి సమయంలో వినియోగదారుల చట్టాన్ని వినియోగించి మోసకారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

రోగుల హక్కు..

ప్రతి రోగి తన ఆరోగ్య స్థితిని పూర్తిగా తెలుసుకోవడం తన హక్కని ఆ హక్కుని ఎవరూ ఆటంకపరచకూడదని జీఎస్ నాయుడు, పి.శ్రీనివాసరావు తెలిపారు. అంతే కాక పూర్తిగా కోలుకునే వరకు ఆసుపత్రిలో సకల వైద్య సదుపాయాలు పొంది తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుని జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించిందని అన్నారు. అలాగే సేవలందిస్తున్న సిబ్బంది లేదా వైద్యుడికి ఎటువంటి ఆటంకాలు కల్పించకూడదని అలా చేస్తే చట్టపరమైన చర్యలకు ఆస్కారం ఉంటుందని వెల్లడించారు. 2013 చట్టాన్ని అనుసరించి మహిళలు పనిచేసే ప్రతి చోట వారి సమస్యల పరిష్కారానికి అంతర్గత కమిటీల నియామకాలు జరగాలని, దురదృష్టవశాత్తు వాటి ప్రస్తావని లేదని శ్రీనివాసరావు అన్నారు.

ఆరు వందల యాప్‌ల నిషేధం

ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వేధింపులతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడటం తీవ్రంగా కలచివేసిందని మహాలక్ష్మి అన్నారు. తాజాగా రిజర్వు బ్యాంకు ఆరు వందల యాప్‌లను నిషేధించిందని ఇందులో మానవహక్కుల సంస్థ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఇటువంటి సమస్యలపై మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయడంతో పాటు స్థానిక పీఎస్‌లను ఆశ్రయించాలని సూచించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

జడ్జిని కోరితే ఉచిత న్యాయసాయం

ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాధిత, పేద వర్గానికి చెందిన వారికి న్యాయ సహాయం కోసం న్యాయమూర్తిని కోరితే 1987 చట్టం సెక్షన్ 12ను అనుసరించి ఉచిత న్యాయ సహాయం అందుతుందని న్యాయవాది, సంస్థ కార్యదర్శి పృథ్వీరాజ్ వెల్లడించారు. పిల్లల్ని హింసించడం వేధించడం చట్టరీత్యా నేరమనీ, పలు ప్రైవేటు విద్యా సంస్థలు టీసీలు ఇవ్వకుండా ఆందోళనకు గురిచేయడం జువైనల్ జస్టిస్ యాక్ట్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ కింద తీవ్ర నేరాలని అన్నారు. 2005 సమాచార హక్కు చట్టం పరిధిలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు, పేర్లు ప్రదర్శించాలని అన్నారు. కాకినాడలో వినియోగదారుల ఫోరం ఉందనీ, విశ్రాంత జిల్లా జడ్జి ఈ ఫోరానికి చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. విక్రేతల చేతుల్లో మోసానికి గురయ్యే వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మహిళా సాధికారిత కోసం కృషి చేసి కిరణ్ బేడీ అవార్డు అందుకున్న పృథ్వీరాజ్‌ను జీజీహెచ్ అధికారులు సిబ్బందితో పాటు సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. డాక్టర్ పుష్కరరావు, డాక్టర్ అనిత, నర్సింగ్ సూపరింటెండెంట్ సంధ్యలకు సంస్థ ప్రతినిధులు మెమెంటోలను బహూకరించారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

కరప: స్థానిక చిరంజీవి కల్యాణమండపంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు డాక్టర్ బొండా సూర్యారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నున్న నరసింహారావు, ముమ్మిడి శ్రీరామారావుల జ్ఞాపకార్థం ప్రవాసాంధ్ర వైద్యనిపుణులు, కాకినాడలోని వివిధ విభాగాల వైద్య నిపుణులు ఈ శిబిరానికి వచ్చి వైద్య సేవలందిస్తారన్నారు. ఉచితంగా రక్తపరీక్షలు, ఈసీజీ, ఎముకల సాంద్రత వంటి పరీక్షలు చేస్తారన్నారు. కరప, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లో కాన్షీరాం జయంతిని శుక్రవారం దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ, ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సెంఘ అధ్యక్షుడు డోకుబుర్ర భద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. బహుజనులను ఏకం చేయడానికి తన జీవితాన్నే పణంగా పెట్టి పోరాడిన మహోన్నత వ్యక్తి కాన్షీరాం అని పలువురు వక్తలు కొనియాడారు. నగరంలోని కుళాయిచెరువు పార్కులు, ఒక వివేకానంద పార్కు వలె, ఘాటీ సెంటర్ పార్కులో కూడా విగ్రహాలు నెలకొల్పి వాళ్ల త్యాగాలను స్మరించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రమంలో ఐక్యవేదిక నాయకులు ఆవుపాటి ఉమాశంకర్, నేల శంకర్‌ప్రసాద్, కొండేపూడి రవికుమార్, సిద్ధాంతపు రాజు, ఎం.నాగేశ్వరరావు, దైవకృప తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత హక్కులతో ఇళ్ల స్థలాలు

- లబ్ధిదారులకు రిజిస్టర్డ్ దస్తావేజుల అందజేత
- పేదలపక్షాన నిలిచిన జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని నాయకుల పిలుపు



కరపలో లబ్ధిదారులకు రిజిస్టర్డ్ దస్తావేజులు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్



కరప సెంట్రల్ లే అవుట్‌లో లబ్ధిదారులకు స్థలాలు చూపుతున్న రెవెన్యూ అధికారులు, నాయకులు

కరప: స్థానిక చిరంజీవి కల్యాణమండపంలో శుక్రవారం లబ్ధిదారులకు శాశ్వతహక్కులు కల్పిస్తూ రిజిస్టర్డ్ దస్తావేజులను నాయకులు, అధికారులు అందజేశారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళాభ్యున్నదే ధ్యేయంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, అక్క, చెల్లెమ్మల పేరునే ఇంటి స్థలం పట్టాలు ఇస్తున్నారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాయమాటలకు మోసపోవద్దన్నారు. మరింతగా అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే వచ్చే ఎన్నికల్లో ఫ్యానుగుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే కన్నబాబును, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను గెలిపించి తద్వారా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ నక్కా వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా సత్తిబాబు, సాదే లోహిదాస్, కారపురెడ్డి రూపేంద్ర, పేపకాయల శ్రీను, రాయుడు శ్రీనివాస్, ఇన్‌చార్జి కార్యదర్శి కె.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల అందజేత

గ్రామంలోని సెంట్రల్ లే అవుట్‌లో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పెదకొత్తూరు గ్రామానికి చెందిన లబ్ధిదారులు 125 మందికి గతంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఇళ్లస్థలాల పట్టాలు అందజేశారు. వారికి శాశ్వతహక్కులతో కూడిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లను శుక్రవారం సర్పంచ్ చింతా నాగలక్ష్మి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అందజేశారు. తర్వాత లబ్ధిదారులను సెంట్రల్ లేఅవుట్‌లోని పెదకొత్తూరుకు కేటాయించిన 3ఎఫ్ లే అవుట్‌కు తీసుకువెళ్లి లబ్ధిదారులకు వారి స్థలాలను చూపి వారికి స్వాధీనం చేశారు. మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా బుజ్జి, పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వాకలపూడి గ్రామస్తులతో కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: స్థానిక వాకలపూడి గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ సమక్షంలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి వీరగని నరేష్ ఆధ్వర్యంలో గుత్తుల శివశంకర్, ముంజులూరి దేవానంద్, ఇసరపు గంగరాజు, మునిగంటి వెంకట కృష్ణారావు తదితర నాయకులు, కార్యకర్తలు 50 మంది యువకులు, జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు వేసి కురసాల సత్యనారాయణ ఆహ్వానించారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు



డ్రైనేజీని ప్రారంభిస్తున్న కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ప్రారంభోత్సవాలు చేపట్టారు. రామకృష్ణానగర్‌లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లను ఆయన ప్రారంభించారు. అనంతరం రమణయ్య పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన 1, 4, 5 సచివాలయ భవనాలను, ఏపీఐఐసీ కాలనీలో నిర్మించిన సామాజిక భవనాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో వాకలపూడి, రమణయ్యపేట గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వినియోగదారుల దినోత్సవం



వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పనిచేస్తున్న వారిని సన్మానిస్తున్న అడబాల తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షురాలు భమిడి రమాదేవి, కొమ్మూరి శ్రీనివాసరావు, భమిడి శివమూర్తి లను అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బుద్దరాజు సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు, పార్థసారధి, చంద్రరావు, రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

నిద్రలేమితో దీర్ఘకాలిక రోగాలు

నిద్రలేమితో మానసిక, శారీరక సమస్యలు తలెత్తి దీర్ఘకాలిక రోగాలకు గురయ్యే అవకాశం ఉందని డాక్టరు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనిషికి నీరు, ఆహారం, ప్రాణవాయువు ఎంత అవసరమో నిద్ర కూడా అంతే అవసరమన్నారు. రోజుకు 6 గంటల నుంచి 8 గంటలకు నిద్ర అవసరమన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీ బాధ్యతలు



కరప పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వీరభద్రరావు, పక్కన సభ్యులు

కరప: మండల పరిధిలో ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ డీసీసీబీ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కరప పీఏసీ చైర్మన్‌గా నక్కా వీరభద్రరావు, సభ్యులుగా భోగిరెడ్డి రామారావు, దెయ్యాల సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే వేములవాడ పీఏసీఎస్ చైర్మన్‌గా బండే పట్టాభిరామయ్య, సభ్యులుగా మాతా సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీనివాస్, జెడ్.భావారం పీఏసీఎస్ చైర్మన్ సింగినీడి తిరుపతిరావు(చినబాబు), సభ్యులుగా పంపన వీర్రాజు, గుబ్బల మరియమ్మ, పెద్దాపురప్పాడు పీఏసీఎస్ చైర్మన్‌గా పేపకాయల పుల్లేశ్వరరావు సభ్యులుగా బూలా సత్యనారాయణ, అనసూరి కృష్ణ బాధ్యతలు స్వీకరించినట్టు ఆయా సొసైటీల సీఈఓలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పీఏసీఎస్‌ల చైర్మన్లు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సకాలంలో పంట రుణాలు అందించి, సొసైటీలను అభివృద్ధిబాటలో నడిపిస్తామన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, ప్రయాగ రాంబాబు, ఫణిశర్మ, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. దేవస్థానం సూపరింటెండెంట్ ఐవీ రామారావుతో పాటు 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

మామిడి పోయింది..!

- పూత ఘనం.. దిగుబడి పతనం
- ఆకాశాన్నంటనున్న మామిడి ధరలు
- పచ్చి మామిడి విక్రయాలు ప్రారంభం



అమ్మకానికి పచ్చి మామిడికాయలు కోస్తున్న రైతు



మామిడి కాయలు

పిఠాపురం: ఈ ఏడాది మామిడి రుచులు చేదెక్కనున్నాయి పూత దశలో విరగబూసిన మామిడి చెట్లు మంచు వల్ల మాడిపోవడంతో పూత రాలి దిగుబడి అమాంతం పడిపోయింది. దీంతో పచ్చళ్లకు ఉపయోగించే పచ్చిమామిడి ధరలు పెరిగి దిగుబడి లేక నష్టాలను చవిచూస్తున్నామని మామిడి రైతులు వాపోతున్నారు. మామిడి సీజన్ ప్రారంభంలో కేజీ రూ.20 వరకు ఉన్న ధరలు బుధవారం నాటికి కేజీ రూ.36 వరకు పెరిగాయి. ఇప్పటికే పలుచోట్ల మామిడి వ్యాపారం ఊపందుకుంది. పచ్చళ్ల కు ఉపయోగించే చెరకురసం, కొత్తపల్లి కొబ్బరి, కలెక్టరు, మామిడికాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం వల్ల ఇప్పటికే పచ్చి మామిడి వ్యాపారం ఊపందుకుంది. ఆరోగ్య ప్రదాయినిగా చెప్పబడే మామిడిని తినని వారుండరు. ముఖ్యంగా పీచు అధికంగా గల బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి మామిడి పళ్లకు ఎక్కువ గిరాకీ ఉంటుంది. కలెక్టరు, కొబ్బరిమామిడి వంటి పచ్చి మామిడి కాయలను ఊరగాయలకు ఎక్కువగా ఉపయోగిస్తారు అందువల్ల మామిడి సీజన్ ప్రారంభంలోనే వీటికి గిరాకీ పెరుగుతుంది. ఊరగాయలకు ఉపయోగించే కేజీ పచ్చి మామిడి కాయలు రూ.28 నుంచి రూ.35 వరకు విక్రయించారు. ప్రస్తుత మామిడి సీజన్‌లో మంచు ప్రభావం మామిడి పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపడంతో ధర ఆశాజనకంగా ఉన్నా మామిడి దిగుబడి తగ్గినందున పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయని రూ.వేలల్లో నష్టాలు వస్తున్నాయని మామిడి రైతులు వాపోతున్నారు. పొగమంచు మామిడి పిందె దశలోనే నాశనం కావడం మామిడి దిగుబడిపై తీవ్రప్రభావాన్ని చూపిందంటున్నారు. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలో సుమారు 1833 ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతుండగా దిగుబడి ఆశాజనకంగా లేదంటున్నారు. ప్రస్తుతం చిన్న సైజులో ఉన్న మామిడికాయలను కూరలలో వినియోగించడానికి కోసి అమ్మకాలు సాగిస్తున్నారు. టెంకలు ముదిరిన కాయలను పచ్చళ్లకు అమ్ముతున్నారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. గత ఏడాది నిత్యం నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 టన్నులకు పైగా మామిడి కాయల క్రయ విక్రయాలు జరగగా ఈ ఏడాది మాత్రం 30 నుంచి 40 టన్నుల మామిడి మాత్రమే క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే మామిడి వ్యాపారులు తక్కువ ధరలకు పచ్చి మామిడి కాయలు కొనుగోలు చేస్తుండడంతో నష్టాల పాలవుతున్నామని ప్రభుత్వం మామిడి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుకు మద్దతు ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఇది ఇలాఉండగా పచ్చి మామిడి కాయలతో తయారు చేసే ఊరగాయలు, ఆవకాయ, మాగాయ వంటి పచ్చళ్ల తయారీలు ఊపందుకోనున్నాయి. ఎక్కడ చూసినా పచ్చడి మామిడి కాయలు జోరందుకోగా ఇళ్ల వద్ద పచ్చళ్ల తయారీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఆస్పత్రిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: నియోజకవర్గ ప్రజలందరికీ మెరుగైన వైద్య ఆరోగ్య సేవలందించడానికి వీలుగా పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని మరింత అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. శుక్రవారం రూ.99.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పిఠాపురం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎంతో చరిత్ర గల ఈ ఆసుపత్రిని ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు. అధునాతన వసతులతో చంటి పిల్లల వార్డు నిర్మించడంతో ఇక్కడ ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. కరోనా సమయంలో ఇక్కడ వేలాదిమంది చికిత్స పొంది ఆరోగ్యవంతులుగా ఇళ్లకు వెళ్లారని ఆయన తెలిపారు. వైద్య సేవల్లో జిల్లాలోని అన్ని ఆస్పత్రుల కంటే మొదటి స్థానంలో ఇక్కడి వైద్య సేవలందుతున్నాయని ఆయనప తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమష్టి కృషితో ఆస్పత్రిని మెరుగైన వైద్య సేవలు అందించే ఆస్పత్రిగా పేరు తెచ్చారని ఆయన తెలిపారు. ఆస్పత్రిలో రోగుల సౌకర్యార్థం దాతల సహకారంతో రూ.3.3 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంకా ఆస్పత్రికి అవసరమైన పరికరాలను కార్పొరేట్ సంస్థ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, బొజ్జా దొరబాబు, బాలిపల్లి రాంబాబు, బొజ్జా రామయ్య, పచ్చిమళ్ల అప్పలరాజు, కొత్తపల్లి బుజ్జి పలువురు వైఎస్సార్ సీపీ నేతలు వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.